కొంత వంటసామగ్రితో మాత్రమే జీవయాత్ర సాగిస్తూ దరిద్ర భారతదేశం అన్నందుకు పేరు నిలబెడుతూంటారు! తనకేం తోచనప్పుడల్లా మార్వాడీల ఘనతను స్తుతించటానికి జహర్ బౌ బజార్‌కు పోతూఉంటాడు. ఒకసారి అతను జేబులు కత్తిరించేవాడని అనుమానం కలిగి, ఓ సి. ఐ. డి. ఉద్యోగి బౌ బజారునుంచి, వరాహ్‌నగర్ వరకు వెంబడించాడు. చివరికి అక్కడొక పాడుపడ్డ కొంపలో దూరి, దొడ్డి గుమ్మం లోంచి తప్పించుకుని పారిపోయి అదృశ్యమవలసి వచ్చింది.

కావలసినన్ని గుడ్డలూ మొదలైనవన్నీ కొనుక్కుని వాళ్లు మళ్ళీ రోడ్డుమీదికొచ్చారు. కొంత దూరం వచ్చాక సుఖలత ఓ చెప్పుల దుకాణంలోకి వెళ్ళబోతూంటే “అందులోకి వద్దు. ఇంకో షాప్‌లోకి వెడదాం” అన్నాడు జహర్.

“ఏం? ఇదీ పెద్దషాపేగా!”

“అక్కడ నేను నౌకరీ చేశాను ఒకప్పుడు.”

“నౌకరీ చేసేవాడివా? చెప్పుల షాపులో?”

“నౌకరీ-అన్నాక ఎక్కడయితే యేం?”

“అదీ నిజమేలే. మరి అలాంటి నిక్షేపం లాంటి నౌకరీ ఎందుకు విడిచిపెట్టావ్? ఆడవాళ్లెవరూ ఆ షాపులో కొనటానికి వచ్చేవాళ్లు కారా?”

“అసలందుమూలంగానే వది లెయ్యాల్సి వచ్చింది. ఒక విశేషమైన కారణం మూలంగా యజమానిని చెప్పుతీసుకు కొట్టాను.”

“చెప్పుతీసుకు కొట్టావా? ఈ అహింసా యుగంలో?” అన్నది సుఖలత నవ్వుతూ.

“అప్పుడు అహింసావాదినిగా ఉండేవాణ్ణి కాను. అవమానానికి బదులు తీర్చుకోవటం మాత్రమే అలవాటుగా ఉండేది” వాళ్లు ఇంకొక షాపులోకి వెళ్ళారు.

(ఇంకా వుంది)

---

కథానిక

# శృంఖలాల శృంగారం

“గోపీ”

చీకటి రాత్రి, ఉరుములు మెరుపులు గంభీరంగా ఉన్నాయి. అప్పుడప్పుడు సుడిగాలి లేచి వీధిలో ఉన్న ఎంగిలాకు లన్నింటినీ రంకుల రాట్నం ఆడిస్తోంది. పంచాయతీవాళ్లు పెట్టిన ఔన్సు-కిరసనాయిలు దీపాలు అరగంట కాకుండానే కొండెక్కిపోయాయి. చినిగిన చొక్కా మాసినగడ్డాం, ఈంద్రపడుతూన్న ఇద్దరు పిల్లల్ని కష్టంమీద నడిపించుకుంటూ పాత దివాణం అరుగుమీదకి చేరబోయాడు. అదేం ఖర్మమో, రెండుగంటలు తిరిగినా అన్నం మాట అటుంచి గంజికూడా దొరకలేదీవేళ. పాతదివాణం సగం పడిపోయి ఉంది. పెణకమీద పెంకులు చాలా మట్టుకు జారిపోయినా, ఒక మూలమాత్రం పొడిగా ఉండేందుకు సరిపోయినంత స్థలంఉంది. ఊరి మధ్యఉన్నా దాన్నిచూచే దాత లేకపోయాడు. సర్కారువారిజాగా; సర్కారువారు ఏంచెయ్యాలో మసీదుకని తురకలూ, మఠానికని సాధువులూ, క్లబ్బుకని పురజనులు, సర్కారువారికి దరఖాస్తుపెట్టారు. పంచవర్ష ప్రణాళికలో దీన్ని కూడా వెయ్యమని ఊళ్ళోఉన్న ఎం. ఎల్. ఏ., గారు గట్టిగా సిఫారసుచేస్తూ పెద్ద రిజల్యూషన్ పంపించారు. దీన్ని మార్చమని అడగంది, ఊళ్ళోని ముష్టివాళ్ళొక్కళ్ళే. వాళ్ళకి ఓ సంఘంఉంటే, పంచవర్ష ప్రణాళిక క్రింద దాన్ని “అల్లాగే ఒదిలీయవలసింది” అని తీర్మానించి ఉండేవారే!

పాతదివాణం చేరేసరికి ప్రాణం లేచొచ్చింది మన బిచ్చముబ్బికి. మెట్టుమీద కాలువేసీ సరికల్లా ‘బౌ’ ‘బౌ’ అంటూ మీద కొచ్చిందో వీధి కుక్క. కొత్తవాళ్ళని చూస్తే కొరకొర. రైలు పెట్టెలో ఉన్నవాడు ప్లాట్‌ఫారంమీద ఉన్నవాణ్ణి చూచినట్లు చూచిందా కుక్క. కాని ఎందుకో “పాలసీ” మార్చుకుంది. వెళ్ళి తన మూల పండుకుంది. మరో మెట్టెక్కేసరికి పోలీసు బిగిలు; వెంటనే ఒక మెరుపు; మెరుపులో

మెలివేస్తున్న బొద్దుమీసాల కనిస్టేబు కనిపించాడు. పెద్దపొట్ట, బొద్దుమీసాలు, ఎర్రటోపీ, కరదీపిక, లాఠీ, యమకింకరుడిలా ప్రత్యక్షమయ్యాడు, పోలీసు కనిస్టేబు గవరయ్య... కాళరాత్రి చెరించే ప్రకృతులెంత విచిత్రమైనవి? దినమోపంచని గడిపే ముష్టివాడు పీక్కుపోతూన్న కాళ్ళతో, ఎక్కడో ఒకచోట నిద్రపోదామన్న ఆత్రుతతో రాత్రిని లక్ష్యం చెయ్యకుండా నడుస్తాడు. గస్తీ తిరిగే కనిస్టేబు: రాత్రి తిరిగే ప్రతీవ్యక్తిని దొంగలా భావిస్తూ కరదీపికతో పరీక్షిస్తూంటాడు.

సందులుగొందులుపట్టి, ప్రతీస్థలాన్ని జాగ్రత్తగా చూచుకుంటూ, "ఎక్కడ సులభంగాకన్నం పడుతుందీ" అని తదేక ధ్యాహ్నంలో, సుమారు బొద్దుమీసాల కానిస్టేబుని రాసుకుంటూపోయి, దద్దరిల్లే కన్నం దొంగ. రాత్రి "ఎప్పటికేది ఎవరిక్కావాలో, బేరం ఎందుకు పాడుచేసుకోడం" అని పాపులోనే కునుకుతూన్న ముసలితాత; ఏమమ్ముతాడో ఏమో! నిద్రపోతూపోతూ చడివినగానే కొంప మునిగిపోయినట్లు, మోర మీద కెత్తుకు అరిచే గ్రామసింహాలు...

"ఎవరు నువ్వు?"అని గద్దించాడు కానిస్టేబు.

గవరయ్యకూడా అసంతృప్తిగానే ఉంది. ఆవేళ ఉరుములు మెరుపులు, దట్టమైన మేఘాలు వీటినుంచి తొందరగా చీకటైంది. లాంతరులేని ఎడ్లబండ్లు, ఇద్దరెక్కిన సైకిళ్లు, రోడ్డుమీద దేహబాధ తీర్చుకునే పల్లెటూరి వారులు, యెవ్వరూ లేరు. ఆవేళ ప్రొద్దున్నే డైరీలో తేదీవేస్తూంటే "హాంచ్ఛీ" అంటూ తుమ్మేడు తోటి కానిస్టేబు. "వెధవ శకునం" అని అప్పుడే అనుకున్నాను. అప్పటినుంచీ పేజీ తెల్లగానే ఉండిపోయింది. గవరయ్య రెండు పేజీలకి తక్కువ యెప్పుడూ రాయలా; ఇవ్వాళ ఎవరూ తప్పులు చేయలేదంటే నమ్మలేకపోయినాడు. పట్నం బస్సుమీద ఓవర్ లోడ్ కేసు జమాయిద్దామనుకుని ఆపమని చెయ్యెత్తాడో లేదో ముందుసీటులోని సబ్ ఇనస్పెక్టరు కనబడ్డాడు. అదే చెయ్యిని వెంటనే సెల్యూట్ క్రింద మార్చి, బస్సుని పోనిచ్చాడు. వీటన్నిటికీ కాల్తూంది గవరయ్య మనస్సు. రెట్టించిఅడిగాడు "ఎవరు నువ్వు?"

"బిచ్చమెత్తుకునోణ్ణి బాబయ్యా."

"ఇంత రాత్రప్పుడు ఇక్కడేంచేస్తున్నావ్?"

"ఏంలేదు బాబా, నిద్దరోదామని వచ్చాను తండ్రీ."

ఇద్దరు పిల్లలూ చెయ్యి వదిలి, బాగా ఉన్న పెంకకింద కుక్కకి దగ్గరగా పడకవేశారు. చిన్న చినుకులు ప్రారంభించాయి. గాలి దుమారం చాలా జోరైంది. రోడ్డుమీద నిలబడ్డం కూడా ఆ గాలిలో కష్టంగానే ఉంది.

"పేరేంపేరు?"

"పెరియ నాయకులు తండ్రీ."

"అడ్డమైన వాళ్ళూ చేరుతారు. ముష్టివాళ్ళమని దొంగతనాలు చెయ్యడం. ఇక్కడ వీల్లేదు. ఊరవతల మరానికి పో."

"తల్లిలేని పిల్లలుబాబూ, రాత్రంతా తిరిగినా పిడికెడు మెతుకులు చిక్కలేదు. క్షమించుతండ్రీ. కాళ్లు పీక్కుపోతున్నాయి. ఈ గాల్లో ఏం పోతాం? రేపణ్ణుంచీ ఇక్కడకొస్తే కాళ్లు ఇరగెయ్యి" అని దీనంగా ప్రార్థించాడు. ఇంకా బ్రతిమిలాడుతూండగానే, పెద్ద సుడిగాలి వచ్చినది. ఎంగిలాకులు, దుమ్ముదుమారం, అంతా తీసుకొచ్చి కానిస్టేబు ముఖాన కొట్టింది కూకటివేళ్లు పెరికిన మహావృక్షంలా మెట్లమీద తిరగబడ్డాడు-ఒక ఈలవేస్తూ.

ఈల విన్న మరో కానిస్టేబు పరిగెత్తుకుంటూ వచ్చాడు. క్రిందపడున్న కానిస్టేబుని చూడగానే బిచ్చగానికి అరదండాలు తగిలించాడు. హాహాకారాలు, ఈలలువేసి మరో నలుగుర్ని పోగుచేశాడు. గవరయ్యని హాస్పటల్‌కి, ఖైదీని కారాగృహానికి చేర్చారు. ఈ కల్లోలం విన్న వాళ్ళంతా, ఇంత భయంకరమైన రాత్రినాడు కూడా "దొంగల్ని" పట్టే రక్షకభటు లుండగా మాకేం భయం అని గుర్రుపెట్టి నిద్రపోయారు.

ఉదయం ఇనప ఊచల వెనకాలనుంచి ప్రపంచాన్ని చూస్తే సురక్షితంగా కనబడింది లోకం. ఇంత చక్కని బసలు, సదుపాయాలు ఉంటూండగా పాతదివాణం పంచనెందుకు అని విచారించాడు. డ్యూటీ వార్డరు అతన్ని పోతూంటేపిలిచి "రాత్రి గంజినీళ్ళన్నా తాగనేదు చెల్లందేమన్నా దొరుగుతుందా?" అని అడిగాడు అమాయికంగా. అకారణంగా తిట్టుకుంటూ పోయాడు వార్డరెందుకో!

రెండ్రోజులు తరువాత ఇద్దరు కానిష్టీబులు సహా కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో ఎవ్వరికీ దేనిబాధా శ్రద్ధ ఉన్నట్లు కనబడదు. పది నిము సాలు ఆలస్యంగా మేజిస్ట్రేటు వచ్చి తన ఆసనాన్నలంకరించాడు. మొదటి కేసే పెరియ నాయకుల్ది.

పోలీసువారారోపించిన నేరం చదివారు— డ్యూటీ కానిష్టీబు కంట్లో దుమ్ముకొట్టి పడ తోసి పారిపోడానికి ప్రయత్నంచేసినట్లుగా. పెరియనాయకుని ముఖం వికసించింది; కనిష్టేబు గవరయ్యని తిరగదోశాడన్న ఖ్యాతి సులభంగా చిక్కినందుగ్గాను. గవరయ్య కంట్లోంచి యిసక తీసినట్లు, గాయం, క్రిందకి తిరగబడ్డప్పుడు రాయి తగిలితే తలిగే గాయంలాగే ఉందని, డాక్టరు సర్టిఫికేటు ఇచ్చాడు. కోర్టువారు ముద్దాయిని మామ్మూలుగా ప్రశ్నలు వేశారు ప్రమాణంచేయించి .. పేరు వృత్తి మొదలుగా గలవి...

"అంత రాత్రప్పుడు అక్కడెందుకున్నావు?"

"ఎక్కడో ఒక్కాడ ఉండాలి కదా బాబయ్యా, రాత్రి, సీకటి. తల్లి లేనోళ్లు ఇద్దరు బిడ్డలు, కడుపు మాడిపోతూంది ఎక్కడికి పోనానికి శత్తినేదు సినుకులు, నానా రసాభసాగుంది..."

"చాలు. నీ కిల్లు లేదన్నమాట."

"నేదుబాబయ్యా."

"కనిష్టీబు గవరయ్యకంట్లో దుమ్ముకొట్టావా?"

"చిత్తం."

"తరవాత గవరయ్యని తిరగదోశావా?"

"చిత్తం."

"పారిపోడానికి ప్రయత్నంచేశావా?"

"చిత్తం."

"సాక్షి-కనిష్టీబు ముసలయ్య"అన్నాడు కోర్టు లాయరు.

"నేనన్నీ ఒప్పుకున్నానుకద బాబయ్యా..."

"ఐనాసరే సాక్షుల్ని పరీక్షచేయాలి."

ముసలయ్యని పేరు, ఊరు, ఉద్యోగం అన్నీ అడిగారు, ప్రమాణంచేయించి.

"గవరయ్యనే పరిస్థితిలో చూచావు?"

"క్రిందపడి ఉన్నాడండీ! పక్కనే ఈడు బిక్కముఖం ఏసి నిలపడ్డాడండి." గవర్నమెంటు లాయరు గుడ్లు మిటకరించాడు.

తలెత్తి, ముద్దాయిని, ముసలయ్యని, గవరయ్యని చూచి, బలవంతాన్న వచ్చే నవ్వు అరికడుతూ, మేజస్ట్రేటడిగాడు.

"ముద్దాయి పరిగెత్తడం లేదన్నమాట."

"పారిపోడానికి ప్రయత్నంచేస్తున్నాడండి."

"ప్రయత్నం చేస్తున్నాడని నువ్వెలా చెప్పగలవు?"

ముసలయ్య బిక్కముఖంవేశాడు, సిగరెట్టు తాగుతూ దొరికిపోయిన బడిపిల్లవాడిలాగ.

...సరి ఏవేవో ప్రశ్నలు ప్రత్యుత్తరాలు జరిగాయి."ఇంతకుముందెప్పుడన్నా జైల్లోపడ్డావా?" అని అడిగాడు బిచ్చగాణ్ణి. "లేదన్నాడు" పెరియ నాయకులు. తీర్పుచెబుతూ, ముద్దాయి ప్రథమ నేరం కాబట్టి ఆరునెల్లు కారాగారవాసం నియమించారు కోర్టువారు.

అందరికంటే సంతోషించినవాళ్లు పెరియనాయకులు, బొద్దుమీసాల కనిష్టీబున్నూ: ముద్ద ప్రక్కగా చేరి "అబ్బి నువ్వదృష్టవంతుడివి పాతదివాణం మిగతా పెణకూడా పడిపోయింది. అదృష్టవశాత్తూ నీపిల్లలిద్దరూ బ్రతికారు కుక్కమాత్రం చచ్చిపోంది"అని చెప్పి తమాషాగ కన్నుగీటాడు.

---

కన్నంనుంచి పైకిరాబోయిన ఎలుకకి, పొంచివున్న పిల్లి కంటబడింది. వెనక్కిపోయి స్నేహితునితో"పొరుగింటి ధాన్యంగాది చూసివద్దాం; నే పోయేవుందున కాని నీలాంటి అద్భుతవ్యక్తి సాంగత్యం వదల్లేను—రా" అంది. "సరే, నడు వెడదాం." "నేనా ముందు! ఎంతమాట! నీలాంటి ప్రఖ్యాతుల్ని అనుసరించాలి నడు" అంది ఎలుక. ఈ మాటలకి పొంగి స్నేహితుడు ముందునడిచాడు. పొంచివున్న పిల్లి దాన్ని నోట కరచుకుపోయింది. అసలు ఎలుక హాయిగా నిశ్చయంగ తనదారిన వెళ్లింది.